# స్వప్న సుందరి

—మంపల లింగరాజు

శ్రీకాకుళం దగ్గరలో వున్న ఒక పచ్చనిపల్లె మాది. పసిడి పంటలకు మా ఊరు పెట్టింది పేరు. నేనేం ధనవంతుణ్నికాదు. మధ్యతరగతి వాణ్ని. నేనొక్కడినే కొడుకును కావడం వల్ల నన్ను ఇంజనీరింగ్ చదివించాలని మా నాన్నగారి కోరిక. ఇంతా కష్టపడి హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యేసరికి నా తల్లిదండ్రులు తెగ బాధపడుతున్నారు. ఒక్కడినే కొడుకుని కావడం వల్ల నాలుగు సంవత్సరాలు దూరంగా పంపించాలంటే భయపడుతున్నారు.

మా నాన్నగారైతే ఏకంగా ఫ్యామిలీనే షిఫ్టు చేస్తానన్నారు. ఎలాగోలా ఇంట్లో ఒప్పించి హైదరాబాద్‌కి వచ్చాను. అయితే మా అమ్మ పట్టుబట్టడంతో మా బామ్మను కూడా నాకు తోడుగా తీసుకొచ్చాను.

నాకు మా బామ్మ అంటే చాలా ఇష్టం. మా ఇద్దరిమధ్యా వయస్సు తేడా రెండు తరాలున్నా మనస్సు మాత్రం రెండురోజులు తేడా కూడా లేదు. మా బామ్మ ఎప్పుడూ తన స్వగతం నాకు చెబుతూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు ఆమె లవ్ స్టోరీ కూడా చెప్పేది. నాకు సిగ్గేసేది, ఎందుకంటే ఇరవై సంవత్సరాల తలమాసినా ఇంకా ఒక అమ్మాయితోనూ ప్రేమకథ నడపనందుకు.

ఎలాంటి పెద్దమనిషితోనైనా ఈజీగా మాట్లాడతాను. కానీ ఒక కొత్త అమ్మాయితో మాట్లాడాలంటే మాత్రం చచ్చేంత సిగ్గు. తప్పని పరిస్థితుల్లో ఓ అమ్మాయితో మాట్లాడవలసివస్తే గాల్లోకి చూస్తూ మాట్లాడతాను!

నేను, రవి, సుధ ముగ్గురం ఒకే క్లాసు. రవి, సుధ హైదరాబాద్ వాస్తవ్యులు. వాళ్లిద్దరి మధ్యా లవ్ అఫైర్ కూడా వుంది. నేను, రవి ఒకే కాలనీవాళ్లం కావడం వల్ల మా ఇద్దరిమధ్య స్నేహం బాగా కుదిరింది.

ఒకసారి మేం ముగ్గురం కలిసి ఓ హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా సుధ అడిగింది ''రాజా..మీ లవర్‌ని మాకు పరిచయం చెయ్యరా?'' అని. నాకు తల తిరిగినంత పనైంది. ఏమి చెప్పాలో తెలియలేదు. ''ఇంతవరకు నేనెవర్నీ ప్రేమించలేదండి'' అన్నాను.

''ఏం రాజూ..మీ వీధిలో ఎవరూ లేరా? అలా అయితే చెప్పండి, మా హాస్టల్లో ఎవరినైనా ప్రేమిస్తానంటే నేను పరిచయం చేస్తాను'' అంది సుధ.

వాళ్ళిద్దరూ నవ్వుకున్నారు. నాకు అనుమానం



మొదలయ్యింది. వీళ్ళు నన్ను ప్రేమించమని సలహా యిస్తున్నారా? లేక ప్రేమ విషయంలో నా చేతకానితనాన్ని చూసి నవ్వుకుంటున్నారా?

ఎందుకో వాళ్ళదగ్గర ఎక్కువసేపు వుండలేక ఇంటికి వచ్చేశాను. ఆరోజంతా మూడీగానే వున్నాను. రాత్రి పన్నెండు దాటుతున్నా నిద్ర రావటంలేదు.

నా మనసులో ఓ కోరిక బలంగా స్థిరపడి పోయింది. ఏదిఏమైనా అర్జంటుగా వారం తిరగకుండా ఒకమ్మాయిని ప్రేమించాలి. ఆమెని సుధ, రవిలకి పరిచయం చేసి నా తఢాకా చూపించాలి.

కానీ ప్రేమించడం ఎలా? ఇదేమైనా కూర గాయలు కొనుక్కోవడమా! ఇంతవరకు నా మనసుకు నచ్చినఅమ్మాయి కనిపించలేదు.

మా వీధిలోఎవరినో ఒకర్ని 'నిన్ను ప్రేమిస్తు న్నాను' అందామనుకున్నాను. కానీ గూబ వాస్తుందేమోనన్న భయం. మర్నాడు కాలేజీకి

వెళ్లలేదు. ఆ రోజంతా ఆలోచించాను. కానీ ఏమీ తోచలేదు. ఆలోచనలతోనే వారంరోజులు గడిచిపోయింది కానీ నా ప్రేమ ప్రయత్నం ముందుకి సాగలేదు. ఎవరినైనా అమ్మాయిని పరిచయం చేసుకోవాలని అనుకున్నా, నా ఆలోచన అమలుకాలేదు.

క్రికెట్ ఆడటం మానేశాను. రాత్రుళ్లు నిద్ర పట్టడం లేదు. నిద్రపట్టినా ఈమధ్య కలలు బాగా వస్తున్నాయి.

ఆకుపచ్చ లంగా, జాకెట్టు, తెలుపు వోణీ ధరించి ఇంటిముందు ముగ్గేస్తున్న ఆమె ఎంత అందంగా వుంది. ఉదయకాల సూర్యకిరణాలు ఆమె పాల బుగ్గలపై పడి చిరునవ్వులై మెరుస్తున్నాయి. ఆమె ప్రతి కదలికలోనూ ఏదో కొత్తదనం.

ఇంట్లో బామ్మ నన్ను నిద్ర లేవమంటూ పెద్దగా కేకేసేసరికి మెలుకువొచ్చింది. నా కలలరాణిని చూడనివ్వని ఈ లోకాన్ని నిందించుకుంటూ లేచి కూర్చున్నాను.

కొన్ని క్షణాలాగి మళ్లీ పడుకున్నాను. మళ్లీ అదే కల. అదే అమ్మాయి. ముగ్గు వెయ్యటం పూర్తిచేసి ఇంట్లోకి దారితీసింది. నేను కూడా ఆమెవెంట వెళదామని కదిలాను. దభీ మని శబ్దం. 'అమ్మో' అంటూ నడుం పట్టుకున్నాను. మంచం మీంచి కింద పడ్డానన్నమాట! ఈమధ్య అన్నీ ఇలాంటి సినిమా కలలే! సినిమాల్లో జరిగినట్టుగానే నా కలల సుందరి కనిపిస్తుందని గట్టినమ్మకం ఏర్పడింది.

ఒకరోజు మా ఓనర్ కొడుకు మధు మేడమీద వున్నప్పుడు, నేను మనసున్న ఓ అమ్మాయిని ప్రేమించాలనుకుంటున్న విషయం వాడికి చెప్పాను.


''రోజుకో వంద నోటు చొప్పున కర్చుపెట్టి హోటల్స్‌కి, సినిమాలకి, షికార్లకి తిప్పితే ఎలాంటి అమ్మాయి అయినా నిన్ను ప్రేమించేస్తుంది. అయినా ఈ నగరంలో నాకు తెలిసినంతవరకు మనసుని చూసి ప్రేమించే అమ్మాయిలు ఎవరూ లేరు. ఉండరు కూడా! నువ్వు తిరుగుతున్న బండిమీద, నువ్వు పెడుతున్న ఖర్చుమీద ఆధారపడి వుంటుంది ఆ ప్రేమ. అందుకే నువ్వు ఎవరినీ మనసు పెట్టి ప్రేమించకు. దేవదాసువి అయిపోతావు'' అంటూ చెప్పాడు మధు.

భుజాలమీద చేతులు వేసుకుని, చేయి చేయి పట్టుకుని పార్టీలు, పార్కులు తిరిగితేనే ప్రేమించుకున్నట్టా! మనసిచ్చి పుచ్చుకుంటేే ప్రేమ కాదా! ఈ నగరంలో ఫ్యాక్టరీల రసాయనాలు ఈ భూమిలోకి యింకి నీటిని కలుషితం చేశాయి. గాలిని కలుషితం చేశాయి. అలాగే వీళ్ల మనసుల్ని కూడా కలుషితం చేశాయి. అదే మా ఊరిలో అయితే స్వచ్ఛమైన నీరు, చల్లటి గాలి, మంచి మనసున్న మనుషులు కనిపిస్తారు.

క్రికెట్ ఆడి అలసి రావడంవల్ల ఫేన్‌వేసి, రిలాక్స్‌గా కూర్చుని కళ్లు మూసుకున్నాను. చల్లని స్వప్నం నా కళ్లను కమ్మేసింది.

ఒక కాలువ మధ్యలో ఒక తెప్ప. దానిమీద నా సుందరి ఒక్కతే కూర్చుని వుంది. ఆమె ఇప్పుడు పంజాబీడ్రస్ వేసుకుంది. మొన్నటి పట్టువోణీ కంటే ఎంతో అందంగా వుంది.

నాకుమాత్రం చేపలా కనురెప్ప వెయ్యకుండా దేవుడు వరాన్నిస్తే బాగుణ్ను అనిపించింది. మధ్యమధ్యలో కనురెప్పలు నన్ను విసిగిస్తూ కదులుతున్నాయి. అయినా వాటిని ప్రతిఘటిస్తూ




కనురెప్పలు వేయకుండా చూస్తున్నాను. అంతలోనే నా కలలరాణి వున్న తెప్ప దూరం అవుతూంది. పిలుద్దామనుకుంటే ఎవరో నన్ను పట్టుకున్నారు. మెలుకువ వచ్చి చూశాను. ఎదురుగా మా బామ్మ.

''ప్రియా అంటున్నావు. ఎవర్నిరా?'' అడిగింది బామ్మ. ''పోవే బామ్మా!'' అంటూ అక్కడ్నించి వెళ్ళిపోయాను.

★ ★ ★

నా కలలరాణి గురించి డైరీలో నేను రాసుకున్న ప్రేమ భావాలన్నీ బామ్మ చదివేసిందనే విషయం బామ్మ చేతిలో వున్న నా డైరీ చెప్పకనే చెప్పింది.

వెంటనే బామ్మ చేతిలో డైరీని లాక్కున్నాను.

బామ్మ నవ్వుతూ, ''ఎవరా అమ్మాయి?'' అని అడిగింది. నాకు ఏం చెప్పాలో అర్థంకాలేదు. ''ఎవరూ లేరు. ఊరికే రాశాను'' అనేసి వెళ్ళిపోయాను.

రవితో బస్సులో వెళుతున్న నాకు అనుకోకుండా ఓ అమ్మాయి కనిపించింది. ఆమె మొహం నావైపు తిప్పేసరికి ఒక్కసారిగా నాకు షాక్ కొట్టినట్టు అయింది. ఆమె ఎవరో కాదు. నేనెవరికోసం కలవరించి, కలలు కంటూ ఎదురుచూస్తున్నానో ఆ కలలరాణి, నా స్వప్న సుందరి ఆమె!

జీన్ పాంటు, టీ షర్టు వేసుకుందామె.

ఆమె ముందుకు కదిలేసరికి నా కళ్ళు కూడా అటు కదిలాయి. బస్సు ఆగిన వెంటనే ఆమె కిందకి దిగేసింది.

''రవీ..నా కలలరాణి ఆమే!'' అంటుండగా బస్సు కదిలింది. రన్నింగ్ బస్సులోంచి నేను నిస్సంకోచంగా దూకేశాను.

నా కళ్ళు ఆమెకోసం వెదికాయి.

రోడ్డుకు అవతలివైపున్న ఒక పెద్ద బిల్డింగ్‌లోకి వెళుతున్న ఆమె కనిపించేసరికి, రోడ్డుమీద వెళుతున్న వెహికిల్స్‌ని పట్టించుకోకుండా నేనటు పరుగెత్తాను.

అది హాస్పిటల్ అని గ్రహించాను. ఆస్పత్రి లోపలికి ప్రవేశించాను.

ఆమె ఓ రూంలోకి వెళ్ళడం చూసి అక్కడే

ఆగిపోయాను. ఆమె వెళ్లిన రూమ్ బయట నేమ్‌ప్లేట్ మీద పేరు చూశాను. డా.నారాయణ, కేన్సర్ స్పెషలిస్ట్ అని వుంది.

పర్మిషన్ లేకుండా లోనికి వెళ్లడం సంస్కారం కాదని ఆగిపోయాను.

నిజమైన ప్రేమకు వేచి వుండటంలోనే మాధుర్యం వుంటుందని మా ఫ్రెండ్ చెప్తే విన్నాను. కానీ నాకు మాత్రం క్షణాలు గడుస్తున్న కొద్దీ యుగాలు గడుస్తున్నట్టే వుంది.

నా కలలరాణితో మాట్లాడాలి. ఆమెని ప్రేమిస్తున్నానని వెంటనే చెప్పేయాలి. ఇంట్లో వాళ్లకి చెప్పి ఆమెని పెళ్లిచేసుకోవాలి.

నేను ఆలోచనల్లో వుండగానే ఆమె నాముందు నుంచే వెళ్లిపోయింది.

ఇప్పుడెలా? ఆమె ఎవరో, అడ్రస్ ఏమిటో ఎలా తెలుసుకోవడం?

ఆమె డా.నారాయణ కూతురై వుంటుందా? అదే నిజమైతే ఆయన నాకు మావయ్య అవుతాడు? అడిగి చూస్తే?

ఎటూ తేల్చుకోలేక అరగంట అతికష్టంమీద గడిపేశాను.

చివరకి ఆమె వివరాలు తెలుసుకోవడానికే నిశ్చయించుకుని, డా.నారాయణగారిని కలిశాను.

''ఎక్స్క్యూజ్‌మి డాక్టర్... ఇప్పుడు వెళ్లిన అమ్మాయి మీ కూతురా?'' అని కాస్త సంశయంగానే అడిగాను.

''కాదు... ఆమె నా పేషెంట్!'' చెప్పాడు డాక్టర్.

''ఏమిటి ప్రాబ్లమ్?''

''ఆమెకి బ్లడ్ కాన్సర్!'' ఆమె మీదున్న జాలి డాక్టర్ కళ్లలో కనిపించింది.

అది విని తట్టుకోలేకపోయాను. నిలబడటానికి ఓపికలేనట్టు అతి కష్టంమీద కుర్చీని ఆసరాగా చేసుకున్నాను. కళ్లలో నుండి నీళ్లు పొంగుకొస్తున్నాయి.

నా కళ్ళల్లో నుంచి గంగా ప్రవాహంలా కన్నీళ్లు...

నా వీపుమీద దెబ్బ పడటంతో తుళ్లిపడి లేచాను..

ఎదురుగా బామ్మ.

నేను పడుకున్న దిండు కన్నీళ్లతో పూర్తిగా తడిచి పోయింది.

''ఎందుకలా ఏడుస్తున్నావు?'' బామ్మ ప్రశ్నకి అతడికి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

''ఏం లేదు..ఏం లేదు'' అని తప్పించుకున్నాను. నాకు అన్నీ సినిమా కలలే వస్తున్నందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

'కలల్లో కనిపిస్తూ తనకు నిద్ర లేకుండా చేస్తున్న తన ప్రేయసి స్వప్నసుందరి తనకీ జన్మలో కనిపిస్తుందో లేదో! ఎదురుచూడటం తప్ప తనేం చేయలేడు!

ఎంతకాలమైనాసరే పర్వాలేదు. తన స్వప్నసుందరి కోసం తను ఎదురుచూస్తాడు. ఆమె కోసం తన అన్వేషణ ఆగదు. తన ప్రేమలో నిజాయితీ వుంటే తన ప్రేయసి కనిపిస్తుంది. ఇది సత్యం!'

స్వగతంగా అనుకున్న మాటలు బామ్మ విన్నది.

'వీడి చదువు ఇక సాగదు. చదువు-సంధ్య లేకుండా కలలు కంటున్నాడు. వీణ్ణి బిజినెస్‌లో పెట్టేసి, వెంటనే పెళ్లి చేసేయమని వీళ్ల నాన్నకి గట్టిగా చెప్పాలి' అని బామ్మ గట్టి నిర్ణయం తీసుకుంది.

★